ప్రజాశక్తి
గురువారం 18 జనవరి 2024
5
అల్లూరి సీతారామరాజు

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రతి ఒక్కరికి మెరువైన వైద్య సేవలు అందుతున్నాయని మండల వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్ చెప్పారు. మండలంలోని కండ్రుమ్ పంచాయతీ కేంద్రంలో బుధవారం డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టలేదని, వైసిపి ప్రభుత్వం మాత్రం సామాన్య వ్యక్తికి కూడా మెరువైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి అంబికా రమణి పాల్గొన్నారు.

హాజరైన వైద్యులు, సిబ్బంది

షోకాజ్ నోటీసులతో బెదిరింపులు

-వేతనాలు పెంచేవరకూ సమ్మె విరమించం-అంగన్‌వాడీలు

అనంతగిరిలో షోకాజు నోటీసులకు సమాధానాలతో అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. జిల్లాలో పలు చోట్ల వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. షోకాజ్ నోటీసులు జారీ చేసి బెదిరించడం సరికాదని పేర్కొన్నారు.

పాడేరు:జిల్లా కేంద్రంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు బుధవారం సమ్మె నిర్వహిస్తున్న శిబిరం వద్ద నుంచి సీడీపీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారం చేయకుండా తమకు వర్తించని ఎస్మా చట్టం తీసుకొచ్చి షోకాజ్ నోటీసులు జారీ చేసిందని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యవర్గ సభ్యులు ఎల్ సుందర్రావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకులు జయ, చిన్నారి, విజయ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ :తమ న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకు తాము విధుల్లోకి చేరేది లేదని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారాణి శారధకు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, హెల్పర్లు సంజాయిషీ నోటీసులు ఇచ్చారు.విధుల్లోకి చేరకపోతే చర్యలు తీసుకుంటామని బెదిరింపు చర్యలకు పాల్పడడంపై స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఐసిడిఎస్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి సిడిపిఓకు నోటీసుకు సంజాయిషి ఇచ్చారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు దుర్య నాగమ్మ, నిర్మల, రాధ, లక్ష్మి, రాధా భారతి, వివిధ సెంటర్లకు చెందిన అంగన్వాడీలు హెల్పర్లు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ:సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడి కార్మికులు చేపడుతున్న సమ్మె మండలంలో కొనసాగుతుంది. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేపడతామని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కె.కొండమ్మ, సత్యవతి, అంగన్వాడి కార్మికులు, హెల్పర్లు పాల్గొన్నారు.

అనంతగిరి: సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యాన జీవో కాపీలు చేత పట్టి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మొస్య మాట్లాడుతూ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి మండల యూనియన్ నాయకురాలు పి,మంజుల, సిఎస్ కళావతి, కె.లక్ష్మి, చిలకమ్మా, సుమిత్ర పాల్గొన్నారు

పాడేరులో...

అంగన్వాడీల భిక్షాటన

విఆర్.పురం :తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 37వ రోజుకు చేరింది. ఇందులో బుధవారం మండలంలోని సున్నం వారి గూడెం, చిన్నమట్టపల్లి గ్రామాల్లో అంగన్వాడీ వర్కర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఇంటింటికి వెళ్లిన అంగన్వాడీలను సిపిఎం మాజీ ఎంపీపీ సున్నం నాగమ్మ, మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య కుమార్తె స్వరాజ్యం తదితరులు సాదరంగా ఆహ్వానించి, ఆర్థిక చేయుతను అందించి, వారి పోరాటానికి మద్దతు పలికారు.సమస్యలను పరష్కరించాలని ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సున్నం నాగమ్మ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, రాజేశ్వరి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

మారేడుమిల్లి : 37వ రోజుకు చేరుకున్న అంగన్వాడీల దీక్షలకు వేటుకూరు సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రత్నకుమారి, ప్రసూన మారేడుమిల్లి, వై.రామవరం పాల్గొన్నారు.

అరకులోయలో ర్యాలీ..

రాజవొమ్మంగి : స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన నాటికి 37వ రోజుకు చేరింది. శిబిరాన్ని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కుంజం జగన్నాథం, కొండ్ల సూరిబాబు, పాండవుల సత్యనారాయణ బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ పండుక కానుకలు ఇస్తానని నమ్మించిన జగన్ అంగన్వాడీలను పండుగ రోజున కూడా సమ్మెలో కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్ కుమారి, కె వెంకటలక్ష్మి, ఎల్ సత్యవతి, రమణి, రత్నం, చిన్నమ్మలు, సుందరమ్మ, నాగమణి, రాధ, భవాని, రాజేశ్వరి, లక్ష్మి, వీరయ్యమ్మ, వీరలక్ష్మి పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలకు తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఆందోళనలో పాల్గొన్న అంగన్వాడీలకు బుధవారం మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జర్తా వెంకటరమణారెడ్డి, వడ్డి రాంబాబు, మేడిశెట్టి శ్రీను, కామన కృష్ణమూర్తి, జుజ్జువరపు శ్రీనివాస్ చౌదరి, ఎడ్ల శ్రీను, కట్రు రాఘవ, సత్తి సత్తిరెడ్డి, పోలురాజు ఈశ్వర్ రెడ్డి, కంట్రోజు శ్రీనివాస్ రెడ్డి, బంట్రాజ్ వీర్‌రెడ్డి, మడిగట్ల రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

విఆర్‌పురంలో భిక్షాటన

రాజ ఒమ్మంగిలో మాట్లాడుతున్న లోతా రామారావు

యథేచ్ఛగా బెల్టుషాపులు

-ఒడిశా మద్యం.. అధిక రేట్లకు అమ్మకాలు

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలో బెల్టుషాపులు యథేచ్ఛగా దర్శనం ఇస్తున్నాయి. ఒడిశా మద్యం మండలంలో మద్యం ఏరులై పారుతోంది. గ్రామాల్లో బెల్టు షాపులు దర్శనం ఇస్తున్నాయి. అధికారులు చెప్పే మాటలన్నీ నీటి మూటలేనని చెప్పడానికి మండలంలో వాడా పల్లె అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్న బెల్టుషాపులే సాక్ష్యాలు. అధికారుల అండదండలతో 3 పెగ్గులు, 6 గ్లాసులుగా మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడి మద్యం కాకుండా ఒడిశా నుంచి ఆటోలలో తీసుకొని వచ్చి అధిక రేట్లకు అమ్మకాలు చేస్తున్నారు. ఊళ్లని మత్తులో ముంచేస్తున్న బెల్టుషాపుల దుకాణాలపై చర్యలు మాత్రం లేవు.

హుకుంపేట మండల కేంద్రంతో పాటు ఉప్ప, బాకురు, తదితర గ్రామాల్లో బెల్టుషాపులు దర్శనమిస్తున్నాయి. మరికొందరైతే ఇళ్లనే బెల్టు షాపులుగా మార్చేసి నడిపిస్తున్నారు. ప్రభుత్వ వైన్స్ దుకాణాల నుంచే వీటికి మద్యం సరఫరా అవుతోంది. లేకుంటే ఒడిశా బోర్డర్ 15 కిలోమీటర్ల దూరమే కావడంతో అక్కడి నుంచి తెచ్చి అమ్మకాలు చేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో సుమారు 20 కు పైగా బెల్టుషాపులు ఉన్నాయి. ఊరికి రెండు, మూడు నడుస్తున్నాయి. ఈ దుకాణాల నిర్వహణలో వైన్స్ నిర్వాహకులదే ప్రధాన పాత్ర. ప్రభుత్వ మద్యం షాపులో నైట్ వాచ్ మెన్లు బెల్టుషాపులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో వైన్స్ నిర్వాహకులు బెల్టుషాపుల ద్వారా మందుబాబులను దోచు కుంటున్నారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు ఉన్నప్పటికీ ఇప్పుడు ఏ బెల్టుషాపు వద్ద చూసినా 'పర్మిట్' లేని రూమ్‌లే కనిపి స్తున్నాయి. వాటిలో అడ్డగోలు అమ్మకాలే దర్శనమిస్తున్నాయి. బెల్ట్ షాపులకు వైన్స్ దుకాణాల నుంచే మద్యం సరఫరా అవుతోంది. అక్కడ పనిచేసే వాచ్ మెన్ లు ద్వారా .బెల్టు షాపుల నిర్వాహకులతో చేతులు కలిపి వారికి సహకరిస్తున్నాట్లు సమాచారం ఉంది.ఒక్కో సీసాపై అదనంగా రూ.10 నుంచి 15ల చొప్పున తీసుకుని కావాల్సినవన్నీ అందిస్తున్నారు. బెల్టు షాపులవారు వాటిని గ్రామాలకు తీసుకెళ్లి.. ఆ రేటుపై అదనంగా మరో రూ.50 నుంచి 70ల వకూ వసూలు చేసి మందుబాబులకు అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసిచూడనట్టిగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ వైన్ షాప్ లో ఒక మనిషి కి 3 బాటిల్స్ మాత్రమే ఇవ్వాల్సి ఉంది. బెల్ట్ షాప్ యజమా నులకు పెట్టెలకు పెట్టేలే ఇస్తున్నారు. అదికారులు స్పందించి బెల్టుషాపులను నియంత్రించాలని కోరుతున్నారు.

ఒడిశాకు చెందిన మద్యం బాటిల్

పండుగను ఆచరిస్తున్న గిరిజనులు

ఆచారాలకు ప్రతీక బలి పండగ

సందడిగా గిరిజన గ్రామాలు

ప్రజాశక్తి-హుకుంపేట:ఏజెన్సీలో తాత ముత్తాతల కాలం నుండి ఆచారంగా గిరిజనుల సాంప్రదా యంగా బలి పండగను నిర్వహిస్తున్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీ. ఈ పండుగ నిర్వహించడంతో పంటలు బాగా పండుతాయని... కోరుకున్న కోరికలు తీరుతాయన్నది గిరిజనుల నమ్మకం.

ఏజెన్సీ ప్రాంతంలోని హుకుంపేట మండలం బూర్జ, గత్తం, ఓల్డ, నిమ్మలపాడు, మత్స్యపురం, రాపా అంతే కాకుండా డుంబ్రిగూడ మండలం కించుమండ, గుంటసీమ, అరమ, గేదల బంద, సాగర, అనంతగిరి మండలం మేడపర్తి, వేంగడా, దేవరపల్లి, అరుకు మండలం సోంపి, సిరగంలో బలి పండుగను నిర్వహిస్తారు. మొక్కజొన్న, గోధుమలు విత్తనాలు తడిపి 11 రోజుల్లో మొలకెత్తినవి ఒక బుట్టిలో వేసుకొని గ్రామ దేవత దగ్గరకు తీసుకొచ్చి పండుగ నిర్వహిస్తారు. భక్తులు తండోపతండాలుగా వచ్చి గిరిజన సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. డిసెంబర్ నెల ఆఖరి నుండి జనవరి నెల వరకు దీనిని నిర్వహిస్తుంటారు. పండుగలో కోళ్ల మేకలు, గేదెలను గ్రామ దేవత దగ్గరకు బలి అర్పిస్తారు. అర్పించిన వాటిని భక్తులకు మూడు రోజులు పాటు భోజనానికి విందు ఏర్పాటు చేస్తారు. ఎంతో సంతోషంగా సంస్కృతి సాంప్రదాయాలతో ఈ పండుగను నిర్వహిస్తారు.

సంతలో సందడి

ప్రజాశక్తి డుంబ్రిగుడ:- సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని గిరిజనులు ఘనంగా పండగ వేడుకలు జరుపుకుంటున్నారు ఈ పండగ సందర్భంగా మండలంలోని కించమండ వారపు సంతలో గిరిజన సంప్రదాయమైన షేర్ బుడియాను సోబోరి నృత్యం చేస్తూ వారపు సంతలో గిరి యువత విచిత్ర వేషధారణతో సందడి చేశారు. వారపు సంతల్లోని ప్రతి దుకాణం వద్ద సోబొరి నృత్యం చేస్తూ చందాలను వసూలు చేశారు.

షేర్ బుడియా వసూలు చేస్తున్న యువకులు

మహోన్నత నేత జ్యోతిబసు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నో ఉన్నతమైన అవకాశాలున్నా వాటిని వదులుకొని కార్మికవర్గ రాజ్య స్థాపన కోసం కమ్యూనిస్టు పార్టీలో చేరి, తుదిశ్వాస వరకు నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసిన మహోన్నత నేత జ్యోతి బసు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమనేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ జ్యోతిబసు 14వ వర్ధంతి సభ బుధవారం అనకాపల్లి సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లోకనాథం, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం లోకనాథం మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పాటు, వరుసగా 5 సార్లు పనిచేసి రికార్డు నెలకొల్పారని తెలిపారు. 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా పార్టీ నిర్ణయమే శిరోధార్యమని భావించి తిరస్కరించిన మహానేత జ్యోతి బసు అని పేర్కొన్నారు. 1914 జులై 8న కోల్‌కతాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన ఇంగ్లాండులో న్యాయశాస్త్రంలో విద్యనభ్యసించారని తెలిపారు. ఆ సమయంలోనే కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితుడై రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారని, కార్మికోద్యమ నేతగా ఎదిగారని చెప్పారు. సమాజ సేవ కోసం కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారన్నారు. బిసి.రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసనసభలో ప్రతిపక్షనేతగా వ్యవహరించారని తెలిపారు. దేశంలోనే భూ సంస్కరణలు అమలు చేసి పేదలకు భూములు పంచారని చెప్పారు. అనేక కార్మిక పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, నాయకులు ఉమా మహేశ్వరరావు, కె.తెల్లయ్యబాబు, శివాజీ, చలపతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నంలో జ్యోతి బసు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

జ్యోతిబసు వర్ధంతి సభ

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జ్యోతిబసు 14వ వర్ధంతి సభను బుధవారం ఘనంగా నిర్వహించారు. మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతిబసు చిత్రపటానికి సిపిఎం నాయకులు జివిఎన్.చలపతి, సిహెచ్‌ఎల్‌ఎన్.శాస్త్రి, ఎవి.పద్మావతి, డాక్టర్ బి.గంగారావు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్‌లో జ్యోతిబసు ముఖ్యమంత్రిగా ఉండగా పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ స్వతంత్రను కాపాడుకునే వ్యవస్థను ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రజలకు మంచి పరిపాలన అందించిన పరిపాలనా దక్షుడని కొనియాడారు. 23ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ఆ పదవిని తరువాతి తరానికి అందించిన గొప్ప మహనీయుడన్నారు. పార్టీ నిర్ణయాలను తూచా తప్పకుండా అమలుచేసిన గొప్ప కమ్యూనిస్టు, నిరాడంబరుడు, అధ్యయనశీలి అని కొనియాడారు. బెంగాల్, త్రిపుర రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వాలను పడగొట్టాలని పెట్టుబడిదారులు, మతతత్వ శక్తులు తీవ్ర కృషిచేశాయని తెలిపారు. నేడు కేరళను కూడా వామపక్ష ప్రభుత్వంపై పెద్దఎత్తున దాడికి దిగుతున్నాయన్నారు. వామపక్షప్రభుత్వం బెంగాల్‌లో ఉన్న కాలంలో మతఘర్షణలకు తావివ్వకుండా పరిపాలన సాగిందని గుర్తుచేశారు. నేడు దేశంలో మతతత్వ శక్తులు పుంజుకోవడంతో దేశభద్రతకు, లౌకికతత్వానికి పెద్దప్రమాదం ఏర్పడిందన్నారు. అంతరాలు లేని సమాజం కోసం నేడు ప్రజలను కదిలించి దోపిడీ వ్యవస్థను కూల్చడం, మతతత్వ రాజకీయలను తిప్పికొట్టడమే నేడు మనముందున్న సవాల్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పీతల అప్పారావు, వి.తులసీరాం, దండునాగేశ్వరరావు, ఎం.ప్రదీప్, జివి.రమణ, రమాప్రభ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ ఎక్కడ పోటీ చేసినా ఓటమి ఖాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఎక్కడ నుండి పోటీ చేసినా ఓటమి తథ్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి అమర్నాథ్ అనకాపల్లి నియోజకవర్గ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, చంద్రబాబు గురించి మాట్లాడే హక్కు అమర్నాథ్‌కు లేదని పేర్కొన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టించిన వైసీపీ ప్రభుత్వం, సిఐడి అధికారులు ఆధారాల్లేక కోర్టులో చార్జిషీట్ వేయలేక నానా అవస్థలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. 11 సిబిఐ కేసులు, 6 ఈడీ కేసులు, 32 క్రిమినల్ కేసుల్లో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఎ1 ముద్దాయిగా ఉన్నారన్నారు. మెగా డీఎస్సీ, గ్రూప్ 1, 2 పోస్టులకు ప్రకటనలు మాత్రమే తప్ప గత సంవత్సరంలో ప్రకటించిన 10,416 పోస్టులు నేటికీ భర్తీ చేయలేదని తెలిపారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు ధనాల విష్ణు చౌదరి, సాలాపు నాయుడు, బోడి వెంకటరావు, బొబ్బిలి గోవింద తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కకు తోసికెళ్లిన బొలెరో వాహనం

బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

- ఇద్దరికి తీవ్ర గాయాలు

- మరో ఏడుగురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిస రోడ్డుపై బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుడిస పర్యాటక ప్రాంతాన్ని తిలకించి తిరుగు ప్రయాణిస్తున్న మారేడుమిల్లి ప్రాంతానికి చెందిన ఏపీ 05ఇకె 3064 గల బొలెరో వాహనం బ్రేకులు ఫెయిలై ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన డి.నాగేంద్ర (23), కె.పూర్ణచందు (22) ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. బోలోరో వాహనంలో ప్రయాణిస్తున్న ఏడుగురు పర్యాటకులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరిని హుటాహుటిన వాహనాల్లో పోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వీరిలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకునికి తీవ్రంగా గాయాలు కావడంతో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇటీవల కాలంలో గుడిస పర్యటక ప్రాంతానికి వెళ్లిన వాహనాలు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఆయా వాహనాలను నియంత్రించాల్సిన పోలీస్, రెవెన్యూ, అటవీశాఖలు దృష్టి సారించకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని పలువురు నుండి బాహటంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ శాఖలు దృష్టి సారించి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

కారు అదుపుతప్పి బోల్తా

ప్రజాశక్తి-సీలేరు

కారు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటన బుధవారం మధ్యాహ్నం జికె.వీధి మండలం రుషియగూడ వద్ద ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నుండి భద్రాచలం, సీలేరు మీదగా శ్రీకాకుళం వారి బంధువులు ఇంటికి వెళ్లేందుకు ఇద్దరు యువకులు కారుపై బయలుదేరారు. జికె.వీధి మండలం రుషియగూడ గ్రామం వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి నాలుగైదు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జ నుజ్జు అయ్యింది. కారు ప్రమాదానికి గురైందని గమనించి రుషియగూడ గ్రామస్తులు వెంటనే సంఘటన ప్రదేశాన్ని చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులు ఉండటాన్ని స్థానికులు గమనించారు. మద్యం మత్తు కారణంగానే కారు బోల్తా కొట్టినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం నేరమని, ప్రమాదం జరిగిన ప్రదేశంలో లోయ లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారని, లేకుంటే మీ పరిస్థితి ఏమిటని ఇద్దరు యువకులను స్థానికులు మందలించారు.

బోల్తా పడిన కారు ఇదే...

ప్రజా సంక్షేమమే ధ్యేయం : బూడి

ప్రజాశక్తి -చీడికాడ:రామాలయ పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. వైసిపి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని మాటల ప్రభుత్వం కాదని ఎప్పుడూ ప్రజాసంక్షేమం కోసమే పాటుపడుతుందన్నారు. మండలంలోని బైలపూడి గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా హెల్త్ సెంటర్, సచివాలయం భవనాలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ప్రతి వీధిలో తిరిగి రామాలయం నుండి పాల కేంద్రం వరకు సిసి రోడ్ నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పురాతన రామాలయం శిధిలమై నందున పునర్నిర్మానికి రూ.10 లక్షలు కేటాయించడంతో పాటు తన సొంత నిధులు లక్ష రూపాయలు ఇస్తానని ఆయన ప్రజలకు తెలిపారు. గ్రామంలో మిగిలిన సమస్యలు ఏమైనా ఉంటే అధికారులకు తెలియజేస్తే తక్షణమే పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు. గ్రామ సర్పంచ్ జాజిమొగ్గల గంగ తల్లి సత్యనారాయణ వైసిపి నేతలు నారాయణమూర్తి, సోము నాయుడు, సుంకర శ్రీను, సుంకర వెంకటరావు, తోపాటు స్థానిక ఎస్సై నారాయణరావు, ఎంపీడీవో జయప్రకాష్ రావు, ఏవో కష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, వాలంటరీలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం పడిగాపులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం ఎస్సీ, బీసీ కాలనీ వాసులు రేషన్ బియ్యం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతి నెల మొదటి వారంలో అందించవలసిన రేషన్ బియ్యాన్ని డీలర్లు, ఎండియులు ఇప్పటికొచ్చి పంపిణీ చేయలేదని విలేకరుల వద్ద వాపోయారు. రేషన్ వాహనం ఏరోజు ఏ సమయంలో వస్తుందో తెలియక కూలి పనులు మానుకొని వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రేషన్ వాహనం వచ్చినప్పటికీ బియ్యం తప్ప మిగతా నిత్యావసర వస్తువులు ఇవ్వలేదని ఆరోపించారు. నేటికి 17 రోజులు గడిచిన 120 మందికి రేషన్ బియ్యం పంపిణీ చేయలేదంటే ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని తక్షణమే రేషన్ బియ్యం పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల్లో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక శతకం పట్టు కళావేదికపై భారత నిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండల స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, మండల సతీష్, తవ్వ సన్యాసయ్య శెట్టి, మొవ్వ బుచ్చయ్య చౌదరి, వీనస్ కోచింగ్ సెంటర్ తాళపురెడ్డి నాగచంద్ర, భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు గౌరీ పట్టపు మహేష్ పాల్గొన్నారు.

సమయం దాటినా.. తెరచుకోని సచివాలయం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని ఖండివరం గ్రామంలో సచివాలయం కార్యాలయం తలుపులు ఉదయం 10.30గంటలు దాటినా తెరుచుకోక పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. సచివాలయం సిబ్బంది కార్యాలయానికి సమయం దాటినా కూడా రాకకపోవడంతో సచివాలయం వద్ద ప్రజలు కాపలా కాయ వలసిన దుస్థితి ఏర్పడిందని ఆ గ్రామ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఒక ప్రక్క అంగన్వాడీల సమ్మె కారణంగా అంగన్వాడీ కేంద్రాల విధులు కూడా సచివాలయం సిబ్బందికి అప్పగించారు. అయినప్పటికీ సచివాలయానికి సమయానికి రాక పోవడం విశేషం. అధికారులు, నాయకులు పర్యవేక్షణ లేకపోవడంతోనే సిబ్బంది విధులకు హాజరు కాలేదని ప్రజలు తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండలంలోని చెట్టుపల్లి గ్రామానికి చెందిన తరగంపూడి సన్యాసిరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు సన్యాసిరావు భార్య పద్మకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 2లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

- ఎస్మాను రద్దు చేయాలి
- సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీల నేతలు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస

ప్రజాశక్తి-పాడేరు:అంగన్వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచాలని, ఎస్మా జీఓ 2ను రద్దు చేయాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే అఖిల పక్ష రాజకీయ పార్టీలతో అవసరమైతే రాష్ట్ర బంద్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాడేరు జిల్లా కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ అధ్యర్యంలో మండల కార్యదర్శి ఎల్.సుందరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తల ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ - జగన్ ప్రభుత్వం నిరంకుశ వైఖరిని ఖండిస్తూ అనే నినాదంతో సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని అఖిలపక్షం ఆమోదించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారంలో సిఎం జగన్ కు చిత్త శుద్ధి లేదన్నారు. 37 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు రాజకీయ పార్టీల మద్దతు గా నిలవాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి పర్వదినాన కూడా నడిరోడ్డుపై నిరాహార దీక్షలు చేస్తూ సమ్మె కొనసాగించారని, రాష్ట్ర చరిత్రలో ఏనాడు పండగ సందర్భంగా ఇట్లాంటి పెట్టిన పరిస్థితి లేదని అన్నారు. జగన్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో ప్రజాసంఘాలు, ఇతర రాజకీయ పార్టీల సహకారం తీసుకొని అంగన్వాడీల పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లామని ఈ సందర్భంగా తెలిపారు.

జనసేన అరకు పార్లమెంట్ ఇన్చార్జి డాక్టర్ వంపులు గంగులయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్నింటా అశాంతి నెలకొందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన షోకాజు నోటీస్, ఎస్మా చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు మాట్లాడుతూ, అంగన్వాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించి, నెలసరి వేతనం రూ.26 వేలు పెంచాలని కోరారు. పండుగ సమయాల్లో అంగన్వాడీలు రోడ్డుపై పోరాటం చేయవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు.బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వండ్ల మాట్లాడుతూ, మహిళల పట్ల సీఎం జగన్‌కు ఉన్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సిపిఐ జిల్లా సమితి నాయకులు అమర్ మాట్లాడుతూ, అంగన్వాడీలకు ప్రతిపక్షాల ప్రోత్సాహిస్తున్నాయని అనడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన నేత సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సింహాద్రి, శ్రీను, స్వాములు, సుబ్రమణ్యం, బాలకృష్ణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి వివిధ పార్టీల నాయకులు, కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

మిలాన్ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష

మిలాన్ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున, నేవీ అధికారులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నేవల్ కమాండ్ ఆధ్వర్యాన ఫిబ్రవరి 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లుగా నిర్వహించే మిలాన్ - 2024 వేడుకల విజయవంతానికి ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. సిరిపురంలోని విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో నేవీ, ఎయిర్ పోర్టు, పోర్ట్ అథారిటీ, కస్టమ్స్, రెవెన్యూ, విఎంఆర్‌డిఎ, జివిఎంసి పోలీసు, పర్యాటక శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా మిలాన్ - 2024 ఇన్‌ఛార్జి, నేవల్ కమోడో సిరజ్ అజాద్ 12వ ఎడిషన్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 19 నుంచి 23వ తేదీ వరకు హార్బర్ ఫేజ్, 24 నుంచి 27వ తేదీ వరకు సీ ఫేజ్ మిలాన్ -2024 కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి దేశ విదేశాల నుంచి అతిథులు విచ్చేస్తున్నారని వివరించారు. ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. 50 విదేశీ నౌకలు, 40 వరకు యుద్ధ నౌకలు, సబ్ మెరైన్లు మిలాన్ వేడుకల్లో భాగస్వామ్యం కానున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 18, 19 తేదీల్లో దేశ, విదేశాల నుంచి వచ్చే నౌకలు విశాఖపట్టణం పోర్టు, నేవల్ డాక్ యార్డుకు చేరుకుంటాయని చెప్పారు. 19వ తేదీన విదేశీ ప్రముఖులు నగరానికి విచ్చేస్తారని పేర్కొన్నారు. 21వ తేదీ నుంచి ప్రధాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. నేవల్ ఆడిటోరియం సముద్రికలో 21న హార్బర్ ఫేజ్ వేడుకలు ప్రారంభమవుతాయని సిరజ్ అజాద్ వివరించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి చేతుల మీదుగా నేవల్ బేస్‌లో అదే రోజు సాయంత్రం మిలాన్ విలేజ్ ప్రారంభోత్సవం కూడా ఉంటుందన్నారు. 22వ తేదీన ఉప రాష్ట్రపతి విచ్చేసి సముద్రికలో జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. అదే రోజు సాయంత్రం బీచ్ వేదికగా జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విచ్చేసి వేడుకల్లో భాగస్వామ్యం అవుతారని వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ మిలాన్ - 2024 వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వివిఐపి, విఐపిల రక్షణ ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు చెప్పారు. సమావేశంలో కమోడో రాజ్ నీష్ శర్మ, పలువురు నేవీ కమాండర్లు, లెఫ్టినెంట్ కమాండర్లు, డిసిపి శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, డిఎఫ్ఒ, విఎంఆర్‌డిఎ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విహారయాత్ర లో విషాదం

యువకులపై దూసుకెళ్లిన బొలెరో

ఒకరు మృతి, పలువురికి గాయాలు

ప్రజాశక్తి-అనంతగిరి:సంక్రాంతి పండుగ అనంతరం విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులకు విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బుధవారం విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం మర్లపల్లి గ్రామానికి చెందిన 12 మంది యువకులు కలిసి ఎన్ఆర్ పురం పంచాయతీ పరిధిలో ఉన్న వాటర్ తిలకించేందుకు వెళ్లారు. తిలకించిన అనంతరం రహదారిపైకి వచ్చి గట్టుపై సేద తీరుతున్న సమయంలో బొలెరో వాహనం వారిపైకి దూసుకు పోవడంతో అదే గ్రామానికి చెందిన కళ్యాణ్ (25) మృతి చెందినట్లు తెలిసింది.మరో ఇద్దరికి తీవ్రమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురికి తీవ్రగాయాలు వీరికి ప్రథమ చికిత్స నిమిత్తం ఎస్. కోట ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయగా వైద్య సేవలు అందించిన అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజిహెచ్‌కు రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించవలసి ఉంది.

రిలే దీక్షను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రెల్లిలకు ఎమ్మెల్సీ కేటాయిం చాలని కోరుతూ ఈ నెల 20న జివిఎంసి గాంధీ విగ్రహం ఒక్క రోజు దీక్ష చేపడుతున్నట్లు రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు తెలిపారు. బుధవారం నర్సీపట్నంలో జరిగిన రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి నర్సీపట్నం మున్సిపాలిటీ అధ్యక్షులు రిష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఒక్కరోజు దీక్ష కార్యక్రమానికి రెల్లిలంతా వేలాదిగా తరలిరావాలని కోరారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేటి వరకు రెల్లిలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నామినేటెడ్ పదవుల్లో కూడా ప్రాధాన్యత లేదన్నారు. విద్య, ఉపాధి, సంక్షేమ అభివృద్ధి రిజర్వేషన్లలో ఎటువంటి ప్రాధాన్యత లేదన్నారు. ఐక్య ఉద్యమంతోనే హక్కులు సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా శ్రీనివాసరావు, ఇల్లపు బిన్నీసులు, వడ్డాది దేవుడు, వడ్డాది అప్పలనాయుడు, భవిరిశెట్టి కన్నారావు, బంగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

భూముల కబ్జాలను అరికట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చంనాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడులను దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దళిత సేన, మాల మహానాడు, జిల్లా సంఘాల ఐక్యవేదిక, దళితరత్న మాల మానాడు దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రభుత్వం దళితులకు చెందిన 28 సంక్షేమ పథకాలు రద్దు చేయడం దారుణమన్నారు. దళితులపై దాడులు అధికమవుతున్నాయన్నారు. దళితవాడలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు.దళితులు భూములు కబ్జాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షులు నక్కెల నాగమణి, నాయకులు నేతల నాగేశ్వరరావు, మాల మానాడు జిల్లా అధ్యక్షులు గాతాడ సహదేవుడు (డికెఎస్ఎస్), రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కోడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: హత్యాయత్నం చేసిన నిందితులను అరెస్టు చేయాలని అనకాపల్లి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యమ్ అప్పలరాజు డిమాండ్ చేశారు. కుల వివక్షతో హత్య ప్రయత్నం చేసిన కేసుల్లో స్టేషన్ బెయిలు రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన నర్సీపట్నంలో ఒక ప్రకటన విడుదల చేశారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలోని వెంకటేశ్వర సినిమా హాలు ఎదురుగా మెయిన్ రోడ్డుపై దళిత యువకుడు భూపతి రాజా, బొర్రా తేజ లపై కత్తితో దాడి చేయడం దారుణమన్నారు. ప్రస్తుతం బాధితులు కేజీహెచ్ లో విషమ పరిస్థితుల్లో చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నారన్నారు. నిందితులను శిక్షించాలన్నారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సంఘటనా స్థలాన్ని డీవియంసి సభ్యులు ఈశ్వరరావు పరిశీలించారు.

స్టీల్ కార్మికుల నూతన వేతనాలు అమలుకు

జాతీయ నాయకత్వంపై ఒత్తిడి చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం :విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల నూతన వేతనాల అమలుకు ఐఎన్‌టియుసి, ఎఐటియూసి, హెచ్‌ఎంఎస్ స్థానిక నాయకులు సంబంధిత జాతీయ నాయకులపై ఒత్తిడి చేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. బుధవారం స్టీల్ సిఐటియు కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 29,30తేదీల్లో దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులు చేపట్టనున్న సమ్మెకు సంబంధించి యాజమాన్యానికి ఇప్పటికే నోటీసు పంపించారని, దీనిలో ప్రధాన డిమాండ్‌గా ఉక్కు కార్మికులకు నూతన వేతనాల అంశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 20న జరుగనున్న ఎన్‌జెసిఎస్ సమావేశంలో జాతీయ నాయకత్వంపై ఒత్తిడి చేయాలన్నారు.

స్టీల్ కార్మికుల నూతన వేతనాల అమలుకు అడ్డుగా నిలిచిన క్లాజ్ నెంబర్ 8ని ఉపసంహరించుకునేలా సెయిల్ యాజమాన్యంపై ఒత్తిడి చేయాలని ఇప్పటికే జాతీయ నాయకత్వం దృష్టికి స్టీల్ సిఐటియు పెట్టిందన్నారు. స్టీల్ ఎన్‌జెసిఎస్ సంఘాల స్థానిక నేతలు కూడావారి జాతీయ నాయకత్వంపై ఒత్తిడి చేయాలని సూచించారు. స్టీల్ యాజమాన్యం వైఖరిని మార్చుకునేంత వరకు పోరాటాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు, టివికె రాజు, బిఎన్ మధుసూదన్, శ్రీనివాసులరెడ్డి, వివిధ విభాగాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కాలినడక వంతెన నిర్మాణం బాలల విజయం

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ కూడలిలో చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఎదురుగా జాతీయ రహదారిపై కాలినడక వంతెన నిర్మాణానికి ప్రభుత్వం, జివిఎంసి శ్రీకారం చుట్టడం బాలల విజయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. రూ.2.5.కోట్లతో 50 అడుగుల పొడుగు,10 అడుగుల వెడల్పు, 22 అడుగుల ఎత్తుతో మరో రెండు నెలల్లో ఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వినియోగంలోకి రానుందన్నారు.

చంద్రపాలెం హైస్కూల్ వద్ద జాతీయ రహదారి దాటే క్రమంలో విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి జగన్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాతీయ రహదారుల విభాగం జాతీయ, రాష్ట్ర ఉన్నతాధికారులకు పలుమార్లు కమిషన్ తరపున విన్నవించడంతోపాటు లేఖలను సమర్పించామన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కూడా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు విశేష కృషి చేయడంతో ఎట్టకేలకు సాకారమైంది. ఈ మేరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టితోపాటు జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, కార్పొరేటర్ లక్ష్మిప్రియాంక, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులకు కమిషన్ తరపున అభినందనలు తెలిపారు.

అప్పన్నను దర్శించిన పార్లమెంటరీ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- సింహాచలం : సింహాద్రి అప్పన్నను పెట్రోలియం స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, ఎంపీ రమేష్‌తోపాటు ఏడుగురు మంది పార్లమెంటు సభ్యులు ఎంకె రాఘవన్, రవిచంద్ర, రొద్మల్ నాగర్, కంట కర్దం, నారంభై కచ్చాడియ, చింతా అనురాధ, మిత్లేష్ కుమార్ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాసమూర్తి ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం శేష వస్త్రంతో సత్కరించి స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రంలోని దేవాలయాల పరిశుభ్రతకు ప్రధాని మోడీ పిలుపుమేరకు స్వచ్ఛ తీర్థలో భాగంగా ఆలయశుద్ధి కార్యక్రమంలో పార్లమెంటరీ కమిటీ బృందం పాల్గొంది. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఇఇ రాంబాబు, ఎఇఒ భ్రమరాంబ పాలూరి నర్సింగరావు, ఎఇ శ్రీహరిరాజు, పర్యవేక్షణాధికారి కనకరాజు పాల్గొన్నారు

స్వచ్ఛ తీర్థలో ఆలయ శుద్ధి

ప్రజాశక్తి- సింహాచలం: స్వచ్ఛ తీర్థలో భాగంగా బుధవారం సింహాచలం ప్రధానాలయంతోపాటు పరిసరాలను పరిశుభ్రం చేశారు. దేవస్థానం ఇఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎఇఒభ్రమరాంబ, అన్నదానం ఎఇఒ నర్సింగరావు, శానిటరీ పర్యవేక్షణాధికారి లక్ష్మీప్రసన్న సానిటరీ సూపర్వైజర్ రామకృష్ణ, ఆలయ పర్యవేక్షణాధికారి కనకరాజు ఆధ్వర్యంలో అంతరాలయం, బేడామండపం, ఆస్థాన మండపం భోగమండపం శుద్ధి చేశారు. లంక సూరిబాబు, నక్క సత్యారావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

భారత్, ఇంగ్లాండ్ రెండో క్రికెట్ టెస్ట్‌మ్యాచ్‌కు

ఆన్‌లైన్‌లో జోరుగా టికెట్ల విక్రయాలు

- -26 నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయం
- -ఆందోళన వద్దు అందుబాటులో అన్ని రకాల టికెట్లు
- రోజుకు రెండు వేలమంది చొప్పున విద్యార్థులకు ఫ్రీ ఎంట్రీ
- ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి.గోపినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు సీరిస్‌లో భాగంగా విశాఖపట్నం ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియం వేదికగా వచ్చేనెల 2 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య 2వ అంతర్జాతీయ క్రికెట్ టెస్టు మ్యాచ్ కోసం అన్ని రకాల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో ఉంచినట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 26 నుంచి ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లుఅందుబాటులో ఉంటాయని, ప్రేక్షకులు, క్రికెట్ అభిమానులు ఆందోళన చెందవద్దన్నారు.

ఈ నెల 15నుంచి పేటిఎం యాప్, insider.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విక్రయం ప్రారంభించిన రెండురోజుల్లో 3 వేల టికెట్ల అమ్ముడుపోయాయన్నారు. క్రికెట్ టెస్ట్‌మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఒక రోజు మ్యాచ్‌కు రూ. 100, రూ. 200, రూ. 300, రూ. 500 విలువ చేసే టిక్కెట్లు, అదేవిధంగా 5 రోజులకు కలిపి రూ. 400, రూ. 800, రూ.1,000 విలువ చేసే టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. రూ.1,500 టికెట్లు ఆన్‌లైన్‌లో అయిపోయినప్పటికీ ఆఫ్‌లైన్ ద్వారా విక్రయించే కౌంటర్లలో కొనుగోలు చేయొచ్చని సూచించారు..ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసేవారు insider.in [illegible] సంబంధించి రెండు ఆప్షన్లు కన్పిస్తాయని, ప్రేక్షకులకు తమకు నచ్చిన ఆప్షన్‌ను ఎంచుకుని టిక్కెట్‌ను పొందవచ్చన్నారు.

26 నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు

భారత్, ఇంగ్లండ్ టెస్టు మ్యాచ్ కోసం ఆఫ్‌లైన్ ద్వారా ఈ నెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు పీఎం.పాలెంలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియం వద్ద అలాగే ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో టికెట్లు అందుబాటులో ఉంటాయని ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. 13,382 టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రంలోని క్రికెట్ క్లబ్ క్రీడాకారుల కోసం 2,850 టికెట్లు, రోజుకు రెండు వేల మంది చొప్పున ఐదు రోజుల్లో 10 వేల మంది విద్యార్థులకు ఉచిత ఎంట్రీ ఇస్తామన్నారు. అయితే విద్యార్థులు ఐడీ కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు రాయితీపై టికెట్లు..

రాష్ట్రంలోని 2,850 మంది క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు రాయితీపై రూ. 250లకు ఐదు రోజుల పాటు మ్యాచ్‌ను తిలకించే అవకాశం కల్పిస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా లోయర్ పెవిలియన్ సీజన్ టికెట్లను విశాఖపట్నంలో కేవలం రూ.1500లకు అందుబాటులో ఉంచినట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

యుద్ధప్రాతిపదికన మరుగుదొడ్లు శుభ్రం

'ప్రజాశక్తి' కథనానికి జివిఎంసి అధికారుల స్పందన

శివాలయం ఎదురుగా ఉన్న మరుగు దొడ్ల ను శుభ్రం చేస్తున్న కేర్ టేకర్

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు శివాలయం ఎదురుగా ఉన్న మరుగుదొడ్లతోపాటు అక్కడి పరిసరాలను యుద్ధ ప్రాతిపదికన శుభ్రపరిచారు. ఈ మరుగుదొడ్ల అధ్వాన్నస్థితిపై 'నిర్వహణలో నిర్లక్ష్యం' శీర్షికన ప్రజాశక్తిలో సోమవారంకథనం ప్రచురితమైన నేపథ్యంలో జివిఎంసి జోనల్ కమిషనర్
బొడ్డేపల్లి రాము స్పందించారు. మరుగుదొడ్ల నిర్వహణపై దృష్టి పెట్టాలని, వెంటనే శుభ్రపరచాలన్న జెడ్‌సి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి మహాలక్ష్మినాయుడు, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శి శివ మరుగుదొడ్లను పరిశీలించారు. సంబంధిత కేర్ టేకర్‌తో వెంటనే శుభ్రపరిచేలా చర్యలు చేపట్టారు. మరుగుదొడ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని కేర్ టేకర్‌కు సూచించారు.

ఈ సందర్భంగా జివిఎంసి భీమిలి జోన్‌ఎఇ సుమన్ స్పందిస్తూ, సంబంధిత మరుగుదొడ్ల వద్ద రన్నింగ్ వాటర్ సదుపాయం కోసం ఏర్పాటు చేసిన మోటారు గతంలో చోరీకి గురైందని, తర్వాత అమర్చిన మోటారు మరమ్మతులకు గురవ్వడం, చిన్నపాటి సాంకేతిక సమస్యల వలన అప్పుడప్పుడు రన్నింగ్ వాటర్ సమస్య తలెత్తిందని, ప్రస్తుతం అటువంటి సమస్య ఏమీ లేకుండా సరిచేసినట్లు వివరించారు

పలు మరుగుదొడ్లు కూల్చివేత :ఎఇ

ఇప్పటికే వివిధ కారణాలతో నిరుపయోగంగా ఉన్న రామన్నపేట, చిట్టివలస జెడ్‌పి హైస్కూల్‌కు ఎదురుగా, శ్రీనగర్‌లో ఉన్న మరుగుదొడ్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చేసే యోచనలో ఉన్నట్లు జివిఎంసి, ఒకటో జోన్ ఎఇ ఎ సుమన్ ప్రజాశక్తి కి తెలిపారు. ప్రతి వార్డులోనూ ఇంటింటా వ్యక్తి గత మరుగుదొడ్లు నిర్మించుకున్న నేపథ్యంలో సామాజిక మరుగుదొడ్ల ఏర్పాటు ఆవశ్యకత లేదన్నారు. దీంతో పలు సామాజిక మరుగుదొడ్లు అనివార్యంగా నిరుపయోగంగా మారాయన్నారు. శిధిలావస్థకు చేరిన, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్ల స్థానంలో సామాజిక భవనాలను నిర్మించే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి- వేపగుంట : పెందుర్తి మాజీ జెడ్‌పిటిసి, కాంగ్రెస్ నేత కంచిపాటి విశ్వనాథనాయుడు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. విజయవాడలోని జనసేన కార్యాలయంలో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విశ్వనాథనాయుడు జెడ్‌పిటిసిగా వ్యవహరించారు. 2019ఎన్నికల్లోనూ అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీచేసే అవకాశం వచ్చినప్పటికీ అనివార్య కారణాల వలన పోటీ నుంచి వైదొలిగారు. కాపు సామాజిక వర్గానికి చెందిన ముఖ్యనేత కావడంతో, కంచిపాటి చేరికతో పార్టీకి లాభిస్తుందని భావిస్తున్నారు. కాగా కంచిపాటికి రానున్న ఎన్నికల్లో ఎక్కడినుంచైనా పోటీకి అవకాశం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అనుచరులతో జనసేనలోకి సూరిబాబు

గాజువాక : వైసిపి 70వ వార్డు అధ్యక్షులు కురిటి వెంకటసూరిబాబు బుధవారం జనసేన పార్టీలో చేరారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో పిఎసి సభ్యులు, గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు పార్టీ కండువా వేసి సూరిబాబును పార్టీలోకి ఆహ్వానించారు. సూరిబాబుతోపాటు సుమ, మరో 15మంది అనుచరులు జనసేనలో చేరారు. కప్పుకున్నారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతం నచ్చి జనసేనలో చేరామని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ అభివద్ధికి గాజువాకలో కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

ఆనందపురం: జనసేన పార్టీ రూరల్ కార్యాలయంలో మండల ప్రధానకార్యదర్శి కోరుకొండ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం కణమాం పంచాయతీ నుంచి 30 మంది పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. కార్యక్రమంలో రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కార్యదర్శి మజ్జి శ్రీను, వార్డు అధ్యక్షులు శ్రీనుబాబు, మండల పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, ఉపాధ్యక్షులు శివకృష్ణ, బాలు, సెక్రటరీలు సన్యాసిరావు, గోవింద్, బంగారు నాయుడు, నాయకులు గనిశెట్టి లోకేష్, వార్డు సభ్యులు అప్పలసూరి ,అప్పలరాజు,గంగరాజు, గిరిరాజు, నరేష్, తరుణ్ పాల్గొన్నారు

శ్రీకృష్ణదేవరాయలుకు ఘననివాళి

ప్రజాశక్తి- వేపగుంట : ఆంధ్రభోజుడు శ్రీకృష్ణ దేవరాయల జయంతిని కాకానినగర్ ప్రాంతంలోని కాపు, తెలగ, బలిజ సామాజిక భవనంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణదేవరాయల చిత్రపటానికి పలువురు ప్రముఖులు, కాపు సామాజిక వర్గం నేతలతో కలసి నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, రాజుగా, పండితునిగా శ్రీకృష్ణదేవరాయలు విశిష్టత, సేవలను కొనియాడారు.

19న అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ప్రజాశక్తి -ఆనందపురం: ఈ నెల 19న విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు పెద్దఎత్తున అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని భీమిలి డివిజినల్ ఎస్‌సి,ఎస్‌టి కమిటీ సభ్యుడు దుమ్మెద అప్పలసూరి కోరారు. విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 125 అడుగుల ఎత్తైన భారీ అంబేద్కర్ విగ్రహం దేశానికే తలమానికంగా నిలుస్తుందన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించే కార్యక్రమానికి నియోజకవర్గంలోని అంబేద్కర్ అభిమానులు తరలిరావాలని కోరారు.

జైభారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్‌గా అనిల్‌కుమార్

అనిల్‌కుమార్‌కు నియామక పత్రం ఇస్తున్న లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జై భారత్ పార్టీ భీమిలి నియోజకవర్గ కన్వీనర్‌గా జివిఎంసి 5వ వార్డు, మధురవాడ నగరపాలెం ప్రాంతానికి చెందిన ఇల్లిపిల్లి అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ తానన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి వెంకటరామారావు, కో ఆర్డినేటర్ రవికిరణ్ పాల్గొన్నారు